క్లుప్తంగా

'ధర్మసమాజ్ పార్టీతోనే మార్పు సాధ్యం'



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌టౌన్: ధర్మ సమాజ్ పార్టీతోనే పేదల జీవితాల్లో మార్పు సాధ్యమని ఆ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు రామగిరి రవీందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రకులాల పాలనతో విసిగిపోయిన ప్రజలు.. బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ధర్మ సమాజ్ పార్టీ మేనిఫెస్టో, భారత రాజ్యాంగం ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రచార కమిటీ సభ్యులు షేక్ జాఫర్, సోన్న భూమేశ్, రాజు, కత్తి శేఖర్, అనిరుధ్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన సిద్దు అనే బాలుడు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సోమారపు సునీల్ అనే ఉపాధ్యాయుడు ఆదివారం తన వంతుగా రూ.5వేలు ఆర్థికసాయంగా బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కావలి సంతోష్, కాలనీవాసులు, అభి, సత్తన్న తదితరులు ఉన్నారు.

సంకష్టహర చతుర్థి వేడుకలు



హోమంలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి గణపతి ఆలయంలో ఆదివారం సంకష్టహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు అనురాగ్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం చేశారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదం స్వీకరించారు. రాత్రి 9:59 గంటలకు చంద్రదర్శనం ఉంటుందని పండితులు పేర్కొన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుంటే సీజ్ చేస్తాం

కడెం: నంబర్‌ప్లేట్ లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నంబర్‌ప్లేట్ లేని పది వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. క్రిమినల్ పనులకు ఉపయోగించేందుకు.. ట్రాఫిక్ చలాన్లు పడకుండా నంబర్‌ప్లేట్లను పెట్టుకోవడం లేదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భీమన్న దేవుడి పండుగ



పూజలు చేస్తున్న నాయక్‌పోడ్ కులస్తులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్‌లో ఆదివారం భీమన్న దేవుడి పండుగను నాయక్‌పోడ్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా మంగళహారతులతో భీమన్న దేవుడికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భీమన్న కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఈ రోజు

విద్యుత్ సరఫరా బంద్

ముధోల్: మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని బట్టీగల్లీ, కసబ్‌గల్లీ, సాయిమాధవ్‌నగర్, బస్టాండ్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జీలుగ విత్తనాల పంపిణీ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఉపకేంద్రంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏవో జాదవ్ సాయికిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లు తీసుకొని సంబంధిత క్లస్టర్ ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. జీలుగ బస్తా ధర రూ.1,116 ఉంటుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డబుల్ ఇళ్లు ఎప్పుడిస్తరో!



రాజురాలో పూర్తికాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- కుభీర్ మండలంలో అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు
- బిల్లులు రాక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- ఆందోళనలో లబ్ధిదారులు

కుభీర్: పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 2020–21లో కుభీర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించింది. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకముందే లబ్ధిదారులను ఎంపిక చేసింది. ప్రభుత్వం ఇచ్చే బిల్లులు సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు కొన్నిచోట్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారు. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తవగా.. మరికొన్నిచోట్ల అసంపూర్తిగా వదిలేశారు. దీంతో తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లు వస్తాయనుకున్న లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాన్ని రద్దు చేసి కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల పేరిట మరో పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో తమ పరిస్థితి ఏంటని ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

కుభీర్ మండలంలో..

కుభీర్ మండలంలో మొత్తం 41 పంచాయతీలుండగా.. ఏడు గ్రామపంచాయతీల్లోని ఎనిమిది గ్రామాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించింది. మండలానికి మొత్తం 173 ఇళ్లు మంజూరవగా.. కేవలం 54 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మరో 119 ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి.



హల్దాలో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు

గ్రామాల వారీగా..

మండలంలోని వర్ని గ్రామానికి 15 ఇళ్లు, కుప్టి–15, సాంవ్లి–17, వీర్‌గాం–16, మాలేగాం–30, హల్దాగ్రాం–30, సాంగ్వి– 30, రాజూరాకు 20 ఇళ్లు కేటాయించారు. ఒక్క వీర్‌గాం పంచాయతీలోనే ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో లబ్ధిదారులు ఉంటున్నారు. హల్దాగ్రాంకు కేటాయించిన 30 ఇళ్లు అసంపూర్తిగానే ఉన్నాయి. రాజురాలో 20 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.లక్ష జమ చేసుకొని ఎకరం భూమి కొనుగోలు చేశారు. అందులో ప్రభుత్వం 20 ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. అన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇక్కడ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.50 వేల వరకు చెల్లించారు. కుప్టి గ్రామానికి 15 ఇళ్లు మంజూరవగా 10 ఇళ్ల నిర్మాణం పూర్తయింది.. మరో 5 అసంపూర్తిగా ఉన్నాయి. కుప్టి పంచాయతీ పరిధిలోని వర్నికి 15 ఇళ్లు మంజూరవగా అన్నీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. సాంవ్లికి 17 ఇళ్లు మంజూరు కాగా 10 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో ఏడు వివిధ దశల్లో ఉన్నాయి. సాంగ్విలో 30 ఇళ్లు కేటాయించగా 18 ఇళ్లు పూర్తవగా.. మరో 12 అసంపూర్తిగా మిగిలాయి. మాలేగాం గ్రామానికి కేటాయించిన 30 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడ కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించినట్లు అప్పటి ఎమ్మెల్యే విఠల్ రెడ్డి గ్రామానికి వచ్చినప్పుడు లబ్ధిదారులు తమ బాధలు వెల్లబోసుకున్నారు.

లబోదిబోమంటున్న లబ్ధిదారులు..

ఆయా గ్రామాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులు.. ఇప్పటికే కాంట్రాక్టర్లకు కొంత ముట్టజెప్పారు. కానీ సదరు కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. కాంటాక్టర్లు మాత్రం ప్రభుత్వం నుంచి బిల్లులు రాకనే పనులు నిలిపివేసినట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి తమకు అందించాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

మా గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులం తలా రూ.లక్ష జమ చేసుకొని ఎకరం భూమి కొనుగోలు చేసి ఇచ్చాం. కాంటాక్టర్‌కు కొన్ని డబ్బులు ఇచ్చాం. రెండేళ్లయినా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలి. – తౌడ నాగన్న, లబ్ధిదారు, రాజురా

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మండలంలోని ఆయా గ్రామాల్లో అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల ప్రకారం మేం చర్యలు తీసుకుంటాం.
– ఎం.సోము, తహసీల్దార్

నిర్మాణాలు సరే.. నిర్వహణ ఏది.?



తానూరు మండలం వాడవన గ్రామంలో నీటితొట్టికి పగుళ్లు

- నిరుపయోగంగా పశువుల నీటితొట్లు
- నీరు దొరకక మూగజీవాలకు కష్టాలు
- నాసిరకం నిర్మాణాలతో పగుళ్లు
- మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలంటున్న పశుపోషకులు

జిల్లా వివరాలు..
పంచాయతీలు : 396
గ్రామాలు : 682
నీటితొట్టిలు : 953
తొట్టిల కోసం చేసిన ఖర్చు : రూ.74,41,488
పని దినాలు : 17,362 రోజులు

తానూరు: గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఏళ్ల కిందట నీటి తొట్లను నిర్మించారు. తర్వాత వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రస్తుత వేసవిలో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. జిల్లాలోని కొన్ని గ్రామాల్లో నీటి సౌకర్యంఉన్న చోట ఈ నీటి తొట్లను నిర్మించగా.. సగానికి పైగా నీటి సౌకర్యం లేని ప్రదేశంలో నిర్మించడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

జిల్లాలో 953 నీటితొట్టిల నిర్మాణం..

జిల్లాలో 396 గ్రామ పంచాయతీలుండగా వాటి పరిధిలో 953 నీటి తొట్లను నిర్మించారు. డ్వామా, ఉపాధిహామీ పథకంలో భాగంగా 2010 నుంచి 2018 సంవత్సరం వరకు ప్రతి గ్రామ పంచాయతీకి సుమారు మూడు చొప్పున నీటి తొట్టిలను నిర్మించారు. ఒక్కో నీటి తొట్టి నిర్మాణానికి రూ.22,190 చొప్పున మొత్తం రూ.74,41,488 లక్షల వరకు ఖర్చు చేశారు. కొన్ని తొట్టిలు వినియోగంలో ఉన్నా.. సగానికి పైగా తొట్టిలకు నీటి సౌకర్యం లేదు. మరికొన్ని నాసిరకంగా నిర్మించడంతో పగుళ్లు తేలి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.



ఝరి(బి) తండాలో నిరుపయోగంగా నీటితొట్టి

వినియోగంలోకి తీసుకొస్తే మేలు..

రూ.లక్షలు వెచ్చించి నిర్మించి నిరుపయోగంగా మారిన పశువులను నీటి తొట్లను డ్వామా, పశు సంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు వినియోగంలోకి తీసుకురావాలని పశుపోషకులు కోరుతున్నారు. బోరు మోటార్లు, తొట్లకు మరమ్మతులు చేయించి భగీరథ నీటిని సరఫరా చేస్తే మూగజీవాల దాహం తీర్చవచ్చని పేర్కొంటున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామాల్లో పశువుల తొట్లకు నీటి సరఫరా లేక నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో మూగజీవాలకు దాహార్తి తీరడం లేదు. ఎండలకు కుంటలు, చెరువుల్లో నీరు దొరకక అల్లాడుతున్నాయి. అధికారులు మరమ్మతులు చేయించి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలి.
– మహేశ్, ఎల్వి, మం.తానూరు

నాసిరకంగా నిర్మాణాలు..

గ్రామాల్లో పశువులు సంచరించే ప్రాంతాల్లో బోరుబావుల సమీపంలో నీటితొట్టిలను నాసిరకంగా నిర్మించారు. ప్రస్తుతం అవి అధిక భాగం పశువుల దాహార్తి తీర్చకుండా వృథాగా పడి ఉన్నాయి. బోరు మోటార్లు చెడిపోవడం.. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయకపోవడం, విద్యుత్ లేక ఇలా చిన్న కారణాలతో నీటి తొట్టిలు నిరుపయోగంగా మారాయి. సర్పంచ్‌లే కాంట్రాక్టర్లుగా మారి పశువుల నీటి తొట్టిలను తూతూమంత్రంగా నిర్మించారు. వీటిలో ఎక్కువ భాగం కాంట్రాక్టర్లే మింగేశారనే ఆరోపణలున్నాయి. దీంతో తొట్టిలకు పగుళ్లు ఏర్పడటం, కొన్నిచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. తానూరు మండలంలో మహాలింగి, తొండాల, నంద్‌గాం, జౌలా(కే) గ్రామాల్లో నీటి సౌకర్యం లేని శివారు ప్రాంతంలో తొట్టిలు నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను కోరినా పట్టింపు కరువైందని రైతులు వాపోతున్నారు.

తాత్కాలిక దుకాణాల తొలగింపు

ఖానాపూర్: పట్టణంలో ప్రతీ ఆది, బుధవారాల్లో వారసంత సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసే తాత్కాలిక దుకాణాలను ఆదివారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్, ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో తొలగించారు. ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ వెళ్లేందుకు దారి లేకపోవడంతో రోడ్డుపై దుకాణాలను వార సంతలోని ఇతర ప్రాంతానికి తరలించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు అమానుల్లాఖాన్, పరిమి సురేశ్, నాయిని సంతోష్, తదితరులు ఉన్నారు.



దుకాణాలను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

అడెల్లిలో భక్తుల సందడి




మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈసందర్భంగా భక్తులు ఆలయంలోని కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా తాగునీటి సౌకర్యం, షామినాయా ఏర్పాటు చేశారు.

యమపాశాలుగా విద్యుత్ తీగలు



రాచాపూర్ సమీపంలో వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌కు తగిలేలా విద్యుత్ తీగలు



రైతులు ఏర్పాటు చేసుకున్న సపోర్టు కర్ర

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ నుంచి పీచర వెళ్లే మార్గంలో వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. రాచాపూర్‌కు చెందిన రైతులు బూషి శేఖర్, నారాయణ, ఎర్రన్న భూముల్లో గతేడాది వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. స్తంభాలు వేయించిన అధికారులు తీగలను సరిచేయకపోవడంతో వేలాడుతున్నాయి. దీంతో రైతులు తమ వ్యవసాయ పనులకు ఇబ్బంది కాకుండా ఓ కర్రను తీగలకు సపోర్టుగా ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల ఈదురుగాలులకు కర్ర విరిగిపోయింది. ప్రస్తుతం చేనలో ట్రాక్టర్‌తో దున్నే పరిస్థితి లేదని.. అధికారులు స్పందించి వేలాడుతున్న తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.



గాలికి కింద పడిన సపోర్ట్ కర్ర

రోడ్డు ప్రమాదంలో ధన్నూర్ వాసికి గాయాలు

సారంగపూర్: మండలంలోని వంజర్ గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోథ్ మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన నల్ల రాజేశ్వర్‌రెడ్డి(48) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. భైంసా–నిర్మల్ రహదారి మీదుగా తన బైక్‌పై వెళ్తుండగా వంజర్ గ్రామ సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ క్రమంలో ఆయనకు తీవ్ర గాయాలవగా స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి ఆసుపత్రికి తరలించారు.

వానల్‌పాడ్‌లో వైద్యశిబిరం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఆదివారం భైంసా అరుష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య శిబిరం నిర్వహించారు. 40 మంది చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బందేల నరేశ్, నాయకులు ముత్యంరెడ్డి, రాంకుమార్, ఈశ్వర్, సాయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

లక్ష్మణచాంద: దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో నిర్మల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు రక్తం అత్యవసరం కావడంతో వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌కు చెందిన ముత్యం ఆసుపత్రికి వెళ్లి రక్తం దానం చేశాడు. దీంతో ముత్యంకు మహిళ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో రాజారావు–విజయలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు సాయిబాబాకు హారతి , అభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

ముధోల్: మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లికి బోనాలను సమర్పించారు. డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి.. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్తీక్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంజిగౌడ్, సాయిగౌడ్, ఆకుల మురళిగౌడ్, దత్తాత్రిగౌడ్, జి.దేవాగౌడ్, ప్రవీణ్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



బోనాలతో మహిళలు

సత్యసాయి జయంతి వేడుకలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆదివారం శ్రీ సత్య సాయి 100వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం వేద మంత్రాల నడుమ శివలింగానికి మహారుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

అటెన్షన్ ప్లీజ్..

కంపు కొడుతున్న డ్రెయినేజీ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఐదో వార్డులో డ్రెయినేజీ చెత్తాచెదారంతో నిండి కంపు కొడుతుంది. డ్రెయినేజీలో కొంతభాగం కూలిపోవడంతో మురుగునీరు నిలిచి దోమలకు నిలయంగా మారింది. పోస్టాఫీస్ వెళ్లేవారు, కాలనీవాసులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలో చెత్తా చెదారం తొలగించి మురికి నీరు నిల్వకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్‌గౌడ్, ఎంపీఓ, ప్రత్యేకాధికారి, నర్సాపూర్(జి),
ఫోన్: 94403 11142

